క్లుప్తంగా

ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆదాయం రూ.2.41 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలరామ ప్రతిష్ఠ క్షేత్రంగా పేరుగాంచిన ఉమారుద్ర కోటేశ్వర స్వామి దేవాలయం హుండీల ఆదాయం లెక్కింపు మంగళవారం నిర్వహించారు. 227 రోజులకు గాను రూ.2,41,968 వచ్చిందని ఈవో సుకన్య తెలిపారు. దేవదాయశాఖ తరఫున మందస గ్రూపు దేవాలయాల ఈఓ ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామ మూర్తి, ట్రస్టు బోర్డు చైర్మన్ పి.దేవేంద్రనాయుడు, పాలక మండలి సభ్యులు జి.శివరామరాజు, కె.రమేష్, ఎస్.శ్రీదేవి, కె.కమల తదితరులు పాల్గొన్నారు.

ధర్మానను కలిసిన యువజన విభాగం కార్యదర్శి



ధర్మాన ప్రసాదరావుతో పొన్నాన మాధవ్

శ్రీకాకుళం రూరల్: మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఇటీవల నియమితులైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాన మాధవ్ మంగళవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను ధర్మాన సత్కరించారు. పార్టీ విధివిధానాలకు అనుగుణంగా పనిచేయాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటం చేయాలని సూచించారు.

ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

గార: శ్రీకూర్మంలో గ్రే వాటర్ (ఇంట్లో కూరగాయలు, వంటగది వాష్‌బేసిన్లు నుంచి వచ్చే నీరు) శుద్ధి చేసేలా ప్లాంటు నిర్మాణం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. దల్లాం చెరువు సమీపంలో ప్రభుత్వ భూమిలో ప్లాంట్ నిర్మించేందుకు అనువుగా ఉందని గుర్తించామని డీఈ ఝాన్సీ తెలిపారు. త్వరలో అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఏఈఈ చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 55 మంది ఎంపిక

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో స్పైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్(చెన్నై) నిర్వాహకులు మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 75 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 55 మంది ఉద్యోగాలు సాధించారు. అందులో ఈసీఈ బ్రాంచ్‌లో 32 మంది, ఈఈఈ బ్రాంచ్‌లో 13 మంది ఉన్నారు. వీరిని ప్రిన్సిపాల్ ఎస్.సి.వి.రమణమూర్తినాయుడు అభినందించారు.

క్యాంటీన్ నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానం



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో క్యాంటీన్ నిర్వహణకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ బి.అడ్డయ్య మంగళవారం తెలిపారు. బిఆర్‌ఏయూ.ఈడీయూ.ఇన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 25లోగా వర్సిటీ రిజిస్ట్రార్ కార్యాలయానికి అందజేయాలని, వివరాలకు 9866299401 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర తైక్వాండో పోటీలకు ఎంపిక



క్రీడాకారిణులతో ప్రిన్సిపాల్ సంధ్య

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు హయాతీనగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పి.లక్ష్మీకవిత (9వ తరగతి), పి.దివ్యశ్రీ (7వ తరగతి) ఎంపికయ్యారు. వీరు శ్రీకాకుళం టౌన్‌హాల్‌లో జరిగిన జిల్లాస్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ పి.సంధ్య తెలిపారు.వీరిని ప్రిన్సిపాల్, సిబ్బంది మంగళవారం అభినందించారు.

అంతిమ సంస్కారాలకూ అవస్థలే..

- భైరివానిపేట శ్మశానవాటిక రహదారి కబ్జా
- పంట పొలాల మీదుగానే మృతదేహాల తరలింపు
- పట్టించుకోని అధికారులు



కబ్జాకు గురైన శ్మశానవాటిక రహదారి



భైరివానిపేటలో గట్లుమీదుగానే మృతదేహాన్ని మోసుకెళ్తున్న గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్: ప్రశాంతంగా సాగాల్సిన అంత్యక్రియల ప్రక్రియ కూడా కొంతమంది కబ్జారాయుళ్ల కారణంగా క్లిష్టతరంగా మారుతోంది. శ్మశానవాటిక రహదారి ఆక్రమణకు గురికావడంతో మృతదేహాల తరలింపు కష్టమవుతోంది. శ్రీకాకుళం నగర పరిధిలోని 50వ డివిజన్ భైరివానిపేటలో ప్రజలకు శ్మశాన కష్టాలు వెంటాడుతున్నాయి. ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటికకు రోడ్డు నిర్మిస్తామంటూ స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు ఈ ప్రాంతాన్ని పలుమార్లు సందర్శించినా వారి మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశానవాటికకు రహదారి కష్టాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆక్రమణకు గురైన శ్మశానవాటికలో కొంత భాగం

కబ్జా వల్లే..



శ్మశాన వాటిక ప్రాంతం, దానికి ఆనుకుని ఉన్న రోడ్డు కబ్జాకు గురయ్యింది. ఏటా పంట పొలాల కోసం గట్లు వేసేటపుడు, దుక్కు దున్నేటపుడు శ్మశానంలో కొంత భాగం కబ్జాకు గురవుతోంది.

– మనోజ్ కుమార్, భైరివానిపేట

ఇబ్బందిపడుతున్నాం..



గ్రామంలో ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. పొలాలు మీదుగా గట్లు వెంబడి ఒకరి తర్వాత ఒకరు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది.

– బాలు, భైరివానిపేట

వినతులు ఇచ్చాం



శ్మశానవాటిక సమస్యపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాం. అధికారులు చూస్తాం ..చేస్తాం అంటున్నారు తప్ప పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదు.

– పొన్నాడ సూర్యనారాయణ, భైరివానిపేట

నవంబర్ 4న సిరిమాను చెట్టుకు బొట్టు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఇప్పిలి శంకరశర్మ, గ్రామ పెద్దలు

అరసవల్లి: అరసవల్లి, కాజీపేట గ్రామదేవత అసిరితల్లి అమ్మవారి సిరిమానోత్సవం వచ్చే ఏడాది ఏప్రిల్ 28న జరుగనున్న నేపథ్యంలో సిరిమాను చెట్టుకు బొట్టు పెట్టేందుకు వచ్చే నెల 4న ముహూర్తం ఖరారు చేసినట్లు అరసవల్లి సూర్య దేవాలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. స్థానిక అసిరితల్లి అమ్మవారి ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బొట్టు కార్యక్రమానికి ఆహ్వాన కరపత్రాలను గ్రామ పెద్దలంతా కలిసి ఆవిష్కరించారు. నవంబర్ 4న ఉదయం 10 గంటలకు వెలమ వీధి దుర్గమ్మ ఆలయం నుంచి మహిళలు ముర్రాటలతో బయలుదేరి ఆలయ పెద్దతోటలో సిరిమాను చెట్టుకు బొట్టు పెట్టే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అరసవల్లి, కాజీపేటతో పాటు పంపుహౌస్, ఆదిత్యనగర్, లక్ష్మీనగర్, కామేశ్వరి నగర్, తెలుగు ముసలయ్య, కొయ్యాన కన్నయ్య కాలనీవాసులంతా పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంతో పదేళ్ల తర్వాత సిరిమానోత్సవానికి శ్రీకారం చుట్టినట్లు అవుతుందని గ్రామపెద్దలు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, తెలుగు నాగరత్నం, ఉంగటి రమణమూర్తి, ఉంగటి పాపారావు, గంగు సీతాపతి, సీర చిన్నారావు, శిమ్మ సూర్యనారాయణ, ఉంగటి రాజ్‌కృష్ణ, నక్క రామకృష్ణ, భైరి సూర్యనారాయణ, గొలివి రమణ, రాయల రామకృష్ణ మూర్తి సోదరులు, తెలుగు జగదీష్, తెలుగు రమేష్, డబ్బీరు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

రణస్థలం: వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎచ్చెర్ల మండల యూత్ వింగ్ కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా పంచిరెడ్డి రాంబాబు, ఉపాధ్యక్షులుగా సీపాన నర్సింగరావు, గుండు సతీష్, జనరల్ సెక్రటరీలుగా దుంప ఢిల్లీశ్వరరావు, జి.రాంబాబు, డొంక రామారావు, సెక్రటరీలుగా మూగి హేమంత్, రేగాన గణేశ్వరరావు, పైడి పురాణి పండిత్, మైలపల్లి అప్పలరాజు, అన్నెపు గోవింద, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా శేష ధర్మారావు, జరుగుళ్ల ప్రసాదరావు, బి.రాజు, తంగి రవి, వావిళ్లపల్లి కూర్మారావు, దుంప గోపాల్, అరసవల్లి సత్యనారాయణలను నియమించారు. జి.సిగడాం మండలం యూత్ వింగ్ కమిటీ అధ్యక్షుడిగా గేదెల నారాయణ రావు, ఉపాధ్యక్షులుగా పాలిశెట్టి కిషోర్, పిన్నింటి పురుషోత్తం, జనరల్ సెక్రటరీలుగా టంకాల రామోహ్మన్‌రావు, కెలం చిన్నంనాయుడు, పాగిరి చిన్నప్పలనాయుడు, సెక్రటరీలుగా దేవిశెట్టి రమేష్, పున్నాన శంకరరావు, ఎందువ మురళి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పాగిరి మౌళి, పైల దుర్గాప్రసాద్, బుంగ శ్రీరామ్, బత్తుల దిలీప్‌కుమార్, దాకర శివ, గార వాసుదేవరావు, బొనెల నాగరాజులను నియమించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



గీతాలు ఆలపిస్తున్న భారతీ రమేష్ బృందం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జీఎస్టీ ఉత్సవ్‌లో భాగంగా ఆరు రోజుల పాటు నిర్వహించే సాంస్కృతికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ గాయకులు భారతీ రమేష్ బృందం చక్కటి సినీగీతాలతో ఆకట్టుకుంది. గాయకులు రమేష్, శ్రీనివాస్, కుసుమ, రమలు ఆలపించగా కీబోర్డుపై రాజు, చిన్న, తబలాపై తేజ, శ్రీను, ప్యాడ్స్‌పై బుజ్జి సహకారం అందించారు.

విశ్వ ఎగుమతిదారుగా భారత్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వస్తువులను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ప్రపంచానికే వస్తువులను ఎగుమతి చేసే స్థాయికి భారతదేశం ఎదిగిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన ఆత్మ నిర్భర్ భారత్ జిల్లా కార్యశాల సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. భారతదేశ కార్మికులు తయారు చేసిన స్వదేశీ వస్తువులనే వాడతామని, స్వయం సమృద్ధ భారతదేశ కలను సాకారం కోసం కార్యకర్తలతో కలిసి స్వదేశీ సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జి, సెవ్వాన ఉమామహేశ్వరి, బిర్లంగి ఉమామహేశ్వరరావు, చింతు పాపారావు, పేడాడ సూరపునాయుడు, పాలవలస వైకుంఠరావు, రాజేశ్వరి పాల్గొన్నారు

నవంబర్‌లో రైతుసంఘం మహాసభలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆంధ్రప్రదేశ్ జిల్లా రైతు సంఘం 15వ మహాసభలు విజయవంతం చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలోని రైతు సంఘ కార్యాలయంలో మంగళవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 15, 16 తేదీలలో టెక్కలిలో మహాసభలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బగాది వాసు, తెప్పల అజయ్‌కుమార్, కరగాన కొండయ్య, వెలమల రమణ తదితరులు పాల్గొన్నారు.

17న గగ్గలమ్మతల్లి పాదుకల ప్రతిష్టాపన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మంగువారితోటలో గగ్గలమ్మతల్లి అమ్మవారి పాదాల ప్రతిష్టాపన ఉత్సవాలు ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు అర్చకులు బంకుపల్లి రవిశర్మ మంగళవారం తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం జరిగిందన్నారు. పాదుకలకు ఉదయం ఊరేగింపు చేసి అనంతరం ప్రతిష్ఠ, యంత్రప్రతిష్ఠ నిర్వహిస్తామని, భక్తులంతా ముర్రాట్లతో పాల్గొనాలని కోరారు.

సైక్లింగ్‌కు సై!

- పెరుగుతున్న ఆరోగ్య స్పృహ
- సైక్లింగ్‌కు ప్రాముఖ్యతనిస్తున్న నగరవాసులు
- బృందాలుగా ఏర్పడి వ్యాయామం



సైక్లింగ్‌కు సిద్ధమవుతున్న ఔత్సాహికులు

శ్రీకాకుళం : జీవన శైలిలో మార్పులు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీనిని అధిగమించాలంటే వ్యాయామానికి మించిన ఔషధం లేదని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నగరవాసుల్లో ఆరోగ్య స్పృహ పెరిగింది. ముఖ్యంగా వ్యాయామం చేసేవారి సంఖ్య ఏటా పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో సైక్లింగ్‌కు చాలామంది ప్రాధాన్యమిస్తున్నారు. వ్యాయామంలో నడక ఎంత కీలకమో సైక్లింగ్‌కు కూడా అంతే ప్రాముఖ్యత ఉంది. నడకకు మించి అధిక ప్రయోజనాలు సైక్లింగ్ వల్ల కలుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. గడిచిన రెండేళ్లుగా శ్రీకాకుళం నగరంలో సైక్లింగ్ చేసేవారు బృందాలుగా ఏర్పడుతున్నారు.వేకువజామున ఒకచోటకు చేరి అక్కడి నుంచి సైక్లింగ్ సాగిస్తున్నారు. ఈ బృందాల్లో చేరే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వీరిలో మహిళలు కూడా చేరుతుండటం విశేషం. శ్రీకాకుళం నగరంలో సైక్లింగ్ చేస్తున్న సభ్యులు నిత్యం మూడు నుంచి నాలుగు కిలోమీటర్లు ప్రయాణం చేసి మంచి ఆరోగ్యాన్ని పొందుతున్నారు. ఆదివారం నాడు ప్రత్యేకంగా ఓ కార్యక్రమాన్ని రూపొందించుకొని మరింత దూరాన్ని ప్రయాణిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఐదు కిలోమీటర్ల నడక వల్ల వచ్చే ప్రయోజనం రెండు కిలోమీటర్ల సైక్లింగ్ వల్ల పొందవచ్చని పలువురు చెబుతున్నారు.

మానసిక ప్రశాంతత



నిత్యం సైక్లింగ్ చేస్తా. దీని వల్ల మానసికంగా ప్రశాంతత లభిస్తుంది. ఆరోగ్యపరంగా అనేక ప్రయోజనాలు పొందగలుగుతున్నాను. సైక్లింగ్ సభ్యుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తోంది.

– నటుకుల మోహన్, రొటేరియన్, శ్రీకాకుళం

నడక కంటే ఉత్తమం



నడక కంటే సైక్లింగ్ ఎంతో ఉత్తమమని వైద్యరంగం చెబుతోంది. మా సభ్యుల్లో గృహిణులతో పాటు వైద్యులు కూడా ఉన్నారు. సభ్యులమంతా ఎంతో ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉంటున్నాం.

– సీజు, సైక్లింగ్ బృందం కెప్టెన్, శ్రీకాకుళం

ప్రయోజనాలివే..

- గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.
- చెడు కొలెస్ట్రాల్‌ను కరిగిస్తుంది.
- రోగ నిరోధక శక్తి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది.
- రక్త ప్రసరణను క్రమబద్ధీకరించి బీపీని అదుపులో ఉంచుతుంది.
- మధుమేహ వ్యాధిని నియంత్రిస్తుంది.
- మానసిక ప్రశాంతత చేకూరుస్తుంది.
- ఎముకలు, కండరాలను దృఢంగా ఉండేలా చేస్తుంది.
- మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది.
- ఒత్తిడి, డిప్రెషన్ తగ్గిస్తుంది.

పేదలకు వైద్యం దూరం చేసేందుకు కుట్ర



నేతేరు-లక్ష్మీపురంలో నిర్వహించిన కోటి సంతకాల రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ తదితరులు

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- నేతేరు–లక్ష్మీపురంలో కోటి సంతకాల సేకరణ

రణస్థలం:

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందని, పేదలకు వైద్యం ఖరీదైపోతుందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండలం నేతేరు–లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలను తీసుకొస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమించుకోకపోతే వైఎస్సార్ సీపీ తరఫున పోరాటాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంలో ఆనాడు మహానేత రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పెడితే నేడు అనారోగ్యశ్రీగా మార్చేసి ప్రైవేటు ఆసుపత్రిలకు బకాయిలు చెల్లించకుండా పేదలకు వైద్యం దూరం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి పేదల శ్రేయస్సు కంటే ఆ పార్టీ నాయకుల క్షేమమే ముఖ్యమని దుయ్యబట్టారు. అనంతరం ఇంటింటికి వెళ్లి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో లావేరు మండల ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, వ్యవసాయ సలహా మండలి కార్యవర్గ సభ్యులు గొర్లె అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు మీసాల సీతంనాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు గొర్లె సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బొంతు సూర్యనారాయణ, వాళ్లె దాలినాయుడు, మహిళా అధ్యక్షురాలు మహంతి విజయలక్ష్మి, మీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తామాడలో సంతకం చేస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

హామీలు అమలు చేశాకే రాష్ట్రానికి రావాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వచ్చే అర్హత లేదని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొత్స సంతోష్ అన్నారు. శ్రీకాకుళం క్రాంతి భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కలిస్తానని చెప్పిన మోదీ తర్వాత యువతను మోసం చేశారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండా, విశాఖ ఉక్కును ప్రైవేటీకరణం చేసే దిశగా ఆలోచన చేస్తున్న ప్రధాని ఏ విధంగా ఈ నెల 16న కర్నూలు ప్రాంతానికి వస్తారని ప్రశ్నించారు. మోదీ రాక సందర్భంగా ఈ నెల 16న గో బ్యాక్ మోదీ నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ టౌన్ కన్వీనర్ వై.వేణు, నాయకులు జగదీష్, పద్మ, కమల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్

మాస్టర్ ప్లాన్‌లో సవరణలు

- మూడు సూచనలిచ్చిన మున్సిపల్ ఓఎస్డీ
- 150 నుంచి 80 అడుగుల రోడ్డుకే పరిమితం!
- ప్రభుత్వానికి త్వరలో కొత్తగా నివేదిక



మాస్టర్ ప్లాన్ నమూనా

శ్రీకాకుళం: నగరంలో అమలు చేయాలనుకున్న కొత్త మాస్టర్ ప్లాన్‌ను సవరణలతో రూపొందించి తిరిగి ప్రభుత్వానికి నివేదించనున్నారు. గడిచిన ఐదు రోజులుగా మాస్టర్ ప్లాన్‌లో అపారే ఇళ్లు, ఆస్పత్రులు కోల్పోనున్న బాధితులతో ఎమ్మెల్యే గొండు శంకర్ ఇటీవల నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. 2017లో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను ఆమోదించడం వల్ల సమస్య తలెత్తిందని, తామంతా నగరపాలక సంస్థ అనుమతితోనే భవనాలు నిర్మించుకున్నామని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన మున్సిపల్ శాఖ మంత్రి ఓఎస్డీతో మాట్లాడాను. ఓఎస్డీ మూడు సూచనలు చేయడంతో అందుకు తగ్గట్టుగా సవరణలు చేసి ప్లాన్ రూపొందించాలని సుడా నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. పాత మాస్టర్ ప్లాన్‌లో కాజీపేట నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు 80 అడుగుల రోడ్డు పొందుపరిచి ఉంది. 150 అడుగుల రోడ్డుకు బదులుగా ఆ రోడ్డును విస్తరించడం మొదటిది కాగా, పొన్నాడ వంతెన నుంచి వాంబే కాలనీ ఆర్చి వరకు ఖాళీ స్థలాలు గుండా రోడ్డున నిర్మించి కె.వి.ఆర్ ఎంక్లేవ్ వద్ద యథావిధిగా ప్రస్తుతం ఆమోదించిన మాస్టర్ ప్లాన్ రోడ్డుకు అనుసంధానించడం రెండవది. అలాగే కాజీపేట నుంచి ఆనందమయి కళ్యాణ మండపం పక్కన ఉన్న మిర్తిబట్టిని ఆనుకొని రోడ్డును నిర్మించి దానిని 80 అడుగుల రోడ్డుకు అనుసంధానించడం మూడోది. శ్రీకాకుళం వంటి నగరానికి 150 అడుగుల రోడ్డు అవసరం లేదని శాసన సభ్యుడు చెప్పగా, ఆ రోడ్డును 80 అడుగులకే పరిమితం చేస్తూ సవరణలతో మాస్టర్ ప్లాన్ తయారుచేసి ప్రభుత్వానికి నివేదించాలని ఓఎస్డీ సూచించడంతో ఆ మేరకు ప్రణాళిక విభాగం అధికారులు సిద్ధమవుతున్నారు.

- ఈ మూడింటిలో దేనివల్ల తక్కువ నష్టం జరుగుతుందో దానినే పరిగణనలోనికి తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులు, సుడా అధికారులు నిర్ణయించారు. దీనిపై ఇప్పటికే అంచనాకు వచ్చిన నగరపాలక సంస్థ అధికారులు పొన్నాడ వంతెన నుంచి బాంబే కాలనీ ఆర్చి వరకు 80 అడుగుల రోడ్డును ఖాళీ స్థలాల ద్వారా నిర్మించి దానిని ప్రస్తుతం ఉన్న 80 అడుగుల రోడ్డు కు అనుసంధానించి కె.వి.ఆర్ లేఅవుట్ నుంచి యథావిధిగా రోడ్డును ఉంచాలని ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అయితే ఖాళీ స్థలాలు పోగొట్టుకునే అవకాశం ఉన్న బాధితులు సైతం తమకు న్యాయం చేయాలని కోరగా, ఖాళీ స్థలాలకు నష్టపరిహారం చెల్లిస్తారు తప్ప ఎటువంటి మార్పులు ఉండవని శాసనసభ్యులు, నగరపాలక సంస్థ అధికారులు తేల్చి చెప్పారు.

రిజిస్ట్రేషన్లు లేనట్టే..

మాస్టర్‌ప్లాన్‌లో ఎటువంటి సవరణలు, మార్పులు చేసినా ఆయా ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికే ఆమోదం పొందిన మాస్టర్ ప్లాన్ పరిధిలో ఉన్న స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం లేకపోవడంతో యజమానులు ఆవేదన చెందుతున్నారు.ఈ సమస్యపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

జి.సిగడాం: పెంట గ్రామానికి చెందిన సింహాద్రి వాసు చేతికి ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. ఈయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, చిత్తిరి మోహన్, సర్పంచ్ పున్నాన అక్కలనాయుడు, ఎంపీటీసీ మక్క శ్రీనివాసరావు, రామకృష్ణంనాయుడు పాల్గొన్నారు.